క్లుప్తంగా

రిపబ్లిక్ డే వేడుకల్లో ఎన్‌సీసీ విద్యార్థులు



విజయవాడస్పోర్ట్స్: ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన 110 మంది ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నట్లు వింగ్ కమాండెంట్ అజిత్‌సింగ్ రాటి, కల్నల్ ఎస్‌కే తన్వర్ తెలిపారు. వేడుకల్లో భాగంగా జరిగిన పరేడ్‌లో విద్యార్థులు పాల్గొని అద్భుత ప్రదర్శన ఇచ్చినట్లు తెలిపారు. పది రోజుల పాటు కఠోర శిక్షణ తీసుకుని ఈ ప్రదర్శన ఇచ్చినట్లు తెలిపారు. పిల్లల్లో క్రమశిక్షణతో కూడిన దేశభక్తి పెంచేందుకు ఈ ప్రదర్శన దోహదపడుతుందని పేర్కొన్నారు.

అపూర్వ కలయిక



భవానీపురం(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని తేలప్రోలు రాజా హైస్కూల్ స్వర్ణోత్సవ వేడుకలను పురస్కరించుకుని 1974–75 బ్యాచ్ పూర్వ విద్యార్థులు కలిసి వేడుకలు జరుపుకున్నారు. ఆదివారం భవానీ ద్వీపంలో సమావేశమైన వారందరూ 50 ఏళ్ల క్రితం హైస్కూల్‌లో గడిపిన మధురానుభూతులను ఒకరికొకరు పంచుకున్నారు. నాడు తమకు విలువలతోకూడిన విద్యాబుద్ధులను నేర్పించిన ఉపాధ్యాయులను గుర్తు చేసుకున్నారు. నేడు వయసులో పెద్దవారమైనప్పటికీ నాటి బాల్య స్మృతులను నేటికీ మరిచిపోలేక పోతున్నామని మురిసిపోయారు. ఈ సందర్భంగా వారందరూ ఆట–పాటలతో సంతోషంగా గడిపారు. కార్యక్రమానికి సారథ్యం వహించిన ఇలిపిళ్ల సరస్వతి, లేళ్ల విజయలక్ష్మిలను బాల్య మిత్రులందరూ అభినందించారు. సమావేశంలో తిరుమల పెద్దింటి రామకృష్ణమాచార్యులు, బాయన వెంకట్రావు, బత్తుల అబ్బాయి, పిళ్లా నటరాజు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ కొండపై భక్తుల రద్దీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులతో ఆలయ ప్రాంగణంలో సందడి వాతావరణం కనిపించింది. ఆదివారం ఉదయం నుంచే ప్రారంభమైన భక్తుల రద్దీ మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు కొనసాగింది. మరో వైపున ఆది దంపతులకు నిర్వహించిన పలు అర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. తెల్లవారుజామున అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీహోమంలో ఉభయదాతలు పాల్గొని తమ నామ గోత్రాలతో పూజలు జరిపించుకున్నారు. మహా మండపం, ఘాట్‌రోడ్డు మీదగా కొండపైకి చేరుకున్న భక్తులు సర్వదర్శనం, రూ. 100, రూ.300, రూ. 500 టికెట్ క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులకు త్వరితగతిన అమ్మవారి దర్శనం అయ్యేలా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఏఈవో, సూపరింటెండెంట్‌లు క్యూలైన్లను పర్యవేక్షిస్తూ భక్తులకు ప్రశాంత వాతావరణంలో అమ్మవారి దర్శనం జరిగేలా చూశారు. సాయంత్రం అమ్మవారికి నిర్వహించిన పంచహారతుల సేవలో పలువురు భక్తులు పాల్గొని తరించారు.

ఆధ్యాత్మికతను పెంపొందించాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజంలో ఆధ్యాత్మికతను పెంపొందించుకున్నప్పుడు శాంతి వర్ధిల్లుతుందని సర్వోదమ మండలి ఏపీ కన్వీనర్ నరహరిశెట్టి శ్రీహరి అన్నారు. నగరంలోని శాంతి సత్సంగ మండలి 46వ వార్షికోత్సవాన్ని పాతబస్తీ గీతామందిరం ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన నరహరిశెట్టి శ్రీహరి మాట్లాడుతూ సమాజంలో ఆధ్యాత్మికతను విస్తృతం చేసేందుకు, శాంతి భావనలను వర్ధిల్లింపజేయటానికి శాంతి సత్సంగ మండలి నాలుగున్నర దశాబ్దాలుగా కృషి చేయటం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుముందు మరిన్ని కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గీతామందిరం అధ్యక్షుడు ఆలపాటి మారుతీరామ్ మాట్లాడుతూ శాంతి సత్సంగ మండలి ప్రస్థానాన్ని అభినందించారు. కార్యక్రమంలో మండలి అధ్యక్షుడు జమిలి పురుషోత్తమరావు సభను నిర్వహించారు. కోశాధికారి రాచపూడి శ్యామ్‌సుందర్, కమిటీ ప్రముఖులు గోళ్ల రామచంద్రరావు, వెజ్జ నరసింహారావు, గొల్లపూడి శ్రీనివాసరావు, ఆధ్యాత్మిక వేత్త వాడపల్లి సీతారామాచార్యులు తదితరులు ప్రసంగించారు.

మువ్వన్నెల జెండా రెపరెపలు

వాడవాడలా ఘనంగా గణతంత్ర వేడుకలు

పటమట(విజయవాడతూర్పు): గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని ఆదివారం నగర వ్యాప్తంగా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల్లో జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ నేతల సేవలను స్మరించుకున్నారు. ప్రజలందరికీ స్వేచ్ఛ, న్యాయం, సమానత్వం, ఉండాలని, ప్రతి పౌరుడికి ప్రాథమిక హక్కులతో సాధికారత కల్పిస్తుందని, ఇది మన మందరం గౌరవించవలసిన రోజుని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో తొలుత ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి వీఎంసీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం భారత రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి, గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవం మనకు భిన్నత్వంలో ఏకత్వాన్ని గుర్తు చేస్తుందని, ప్రతి పౌరుడు సామరస్యంతో జీవించడానికి మన రాజ్యాంగం పునాది వేసిందన్నారు. అనంతరం మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధుల ఐకమత్యంతోనే నగరాభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం ఎన్‌సీసీ, ఆర్మీ, నేవీ, వాయు దళ విద్యార్థుల గౌరవ వందనాన్ని నగర మేయర్ భాగ్యలక్ష్మి, ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ స్వీకరించారు. అనంతరం వీఎంసీలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించిన అధికారుల, ఉద్యోగులు, కార్మికులకు ప్రతిభా పురస్కారాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శైలజ, టీడీపీ, సీపీఐ ఫ్లోర్ లీడర్లు నెలిబండ్ల బాలస్వామి, సత్తిబాబు, కార్పొరేటర్లు శర్వాణి మూర్తి, ఉమ్మడి చంటి, జాస్తి సాంబశివరావు, షాహినా సుల్తానా, చెన్నగిరి రామ్మోహన్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

చిట్టినగర్ పరిధిలో..

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పాలప్రాజెక్టు ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబులు విచ్చేసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సెక్యూరిటీ సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఎంతో మంది స్వాతంత్య్ర సమర యోధుల త్యాగ ఫలాలను ఈ రోజు మనందరం అనుభవిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సమితి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వీఎంసీలో నివాళులర్పిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, అధికారులు



జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన షేక్ ఆసిఫ్



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పోతిన మహేష్

రాకేష్ పబ్లిక్ స్కూల్‌లో...

కేఎల్‌రావు నగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం గణతంత్ర వేడుకలను నిర్వహించారు. తొలుత స్కూల్ ఆవరణలో జెండావిష్కరణ కార్యక్రమాన్ని స్కూల్ డైరెక్టర్ ఎన్వీ.రావు నిర్వహించగా, ఉపాధ్యాయులు విద్యార్థుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

ఆసిఫ్ ఆధ్వర్యంలో..

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సమాజంలో పేదరిక నిర్మూలన సాధ్యమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు షేక్ ఆసిఫ్ అన్నారు. గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని పంజా సెంటర్‌లో ఆటోడ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జాతీయ పతకాన్ని ఆసిఫ్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో పచ్చిగళ్ల రమేష్, గాంధీ, నురుద్దీన్, కల్యాణ్, జాన్సన్, సురేష్, స్వామి, శివరామ్, నజీర్, నయీమ్, ఖాజా పాల్గొన్నారు.

పోతిన మహేష్ ఆధ్వర్యంలో..

కొత్తపేట కోమల విలాస్ సెంటర్ వద్ద గల పోతిన వెంకట మహేష్ కార్యాలయంలో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. పోతిన మహేష్ జాతీయ పతాక ఆవిష్కరణ చేశారు. అనంతరం పిల్లలకు పుస్తకాలు పెన్నులు, మిఠాయిలు పంపిణీ చేసినారు. వాయిస్ ఆఫ్ మాల మహానాడు అధ్యక్షుడు శ్యామ్, సీనియర్ నాయకులు బొంతు గంగాధర్, నూనె సోమశేఖర్, జెల్లీ రమేష్, సిగ్నమ్ శెట్టి రాము గుప్తా, అడ్డూరి తమ్మారావు, సోమీ గోవింద్, షేక్ షాహినా, నేమాల సంజీవరావు, పిల్లా రవి పాల్గొన్నారు.

భవానీపురం వ్యాప్తంగా..

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లో 38వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా జాతీయ పతాకాన్ని ఎగురవేసి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఎస్‌కే ఇర్ఫాన్, హన్ను, బాజీ, అహ్మద్ పాల్గొన్నారు. జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ కొరగంజి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ప్రజావైద్యశాల డాక్టర్ వాండ్రాసి శ్రవణ్‌కుమార్, శంకర్ కంటి ఆస్పత్రి డాక్టర్ రాధాకృష్ణ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో దాదాపు 300 మందికి వైద్య పరీక్షలు చేశారు. కంటిలో శుక్లాలు ఉన్నవారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేయిస్తామని చెప్పారు. శుక్లాలు లేనివారికి డ్రాప్స్, కళ్లజోళ్లు ఉచితంగా అందజేశారు. గూడేల రామకృష్ణ(ఆర్కే), సోషల్ వర్కర్ డీ రాము, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. గొల్లపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో అగర్వాల్ యువ మండలి సభ్యులు మనీష్ గుప్తా, ఆశిష్ గుప్తా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు బహూకరించిన ఐఎఫ్‌పీ ప్యానల్‌ను ప్రారంభించి విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున మరో ఐఎఫ్‌పీ ప్యానల్‌ను అందజేస్తామని తెలిపారు. సభ్యులు వినయ్ గుప్తా, నిఖిల్ గుప్తా, న్యాయవాది కేజేఎస్ ప్రకాష్,, సంఘ సభ్యులు ఆర్ గోపాలం, దారా నాగేశ్వరరావు, మిరియాల సంగీతరావు, పాఠశాల హెచ్‌ఎం కూచిపూడి తరుణ్ బాబు పాల్గొన్నారు.



బెజవాడ రాజారావు స్కూల్‌లో సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థినులు

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు..

బెజవాడ రాజారావు హైస్కూల్‌లో జరిగిన వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ నరేంద్ర రాఘవ, పాఠశాల కరస్పాండెంట్ బెజవాడ రాజారావు ఎన్‌సీసీ విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. వివిధ పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని ఆల్ ఎంప్లాయీస్ పెన్షనర్స్ అసోసియేషన్ హాల్‌లో జరిగిన వేడుకల్లో గౌరవ అధ్యక్షుడు డాక్టర్ దేవరకొండ శేషగిరిరావు జాతీయ జెండా ఎగురవేశారు. అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు వై.వెంకటేశ్వర్లు, పీ పట్టాభిరామారావు, సందక కృష్ణ, వై.సుబ్బారావు, కె.సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. విద్యాధరపురం లేబర్‌కాలనీలోని జీఎస్‌ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో స్థానిక కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. హైస్కూల్ హెచ్‌ఎం రవికుమార్, ఎలిమెంటరీ స్కూల్ హెచ్‌ఎం ప్రసన్న తదితరులు పాల్గొన్నారు. భవానీపురం హెచ్‌బీకాలనీలోని 300–450 ఎస్ఎఫ్‌టీ ఫ్లాట్స్ ఓనర్స్ అండ్ రెంటల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల సాంబశివరావు, ప్రెసిడెంట్ సీతా చంద్రశేఖర్ జాతీయ జెండా ఎగురవేశారు. సెక్రటరీ అజీజ్, కోశాధికారి విశ్వనాథ్, వి.లక్ష్మి, రామారావు, సంధ్య, ప్రమోదిని, గజపతి పాల్గొన్నారు.



ఇంద్రకీలాద్రిపై జెండా ఆవిష్కరిస్తున్న డీఈవో రత్నరాజు, ఆలయ అధికారులు

దుర్గగుడిపై వేడుకలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఆదివారం గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ వద్ద నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా డీఈవో రత్నరాజు హాజరయ్యారు. తొలుత భరతమాత, గాంధీజీ, దుర్గమ్మ చిత్రపటాలకు పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం రత్నరాజు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎస్‌పీఎఫ్, హోంగార్డుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు, సూపరింటెండెంట్లు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొని జెండాకు వందనం సమర్పించారు. భక్తులకు, చిన్నారులకు అమ్మవారి ప్రసాదాలు, మిఠాయిలను పంపిణీ చేశారు.



పాలప్రాజెక్టులో..



38వ డివిజన్‌లో స్వీట్స్ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రెహమతున్నీసా



వైఎస్సార్ కాలనీలో జాతీయ జెండా ఎగురవేస్తున్న ఎంపీటీసీ సత్యనారాయణ



గొల్లపూడి అంబేడ్కర్ స్కూల్‌లో నివాళులు అర్పిస్తున్న అగర్వాల్ యువ మండలి సభ్యులు



రాకేష్ పబ్లిక్ స్కూల్‌లో...

విజేతలకు బహుమతుల ప్రదానం

భవానీపురం(విజయవాడపశ్చిమ): వడ్లమూడి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్ట్ (గొల్లపూడి) ఆధ్వర్యంలో ఆదివారం గొల్లపూడిలోని ఎస్‌పీఎస్‌ఆర్‌సీ ప్రభుత్వ హైస్కూల్‌లో 'మేధ'– 2025 పేరుతో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్విజ్, వ్యాసరచన, కథల పోటీలలో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. క్విజ్ పోటీలో మంగళగిరి అరవింద మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం, విజయవాడ వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్, నందిగామ శ్రీవిద్య హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వ్యాసరచన పోటీల్లో విజయవాడ వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని వైవీ సాయి సృజని, నందిగామ శ్రీవిద్య హైస్కూల్ విద్యార్థిని ఎస్ ప్రజ్ఞ, గుంటుపల్లి సెయింట్ ఆన్స్ హైస్కూల్ విద్యార్థిని ఎం శ్రేష్ఠ, కథల పోటీలో నిడమానూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని పి.చరిత, జీబీజీ ఇంటర్నేషనల్ స్కూల్(గొల్లపూడి) విద్యార్థి జితేష్ మొదటి స్థానాన్ని పంచుకున్నారు. ద్వితీయ స్థానాన్ని కొండపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థిని కె.హారిక, వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని పి.శ్రియ పంచుకున్నారు. తృతీయ స్థానాన్ని మంగళగిరి అరవింద మోడల్ స్కూల్ విద్యార్థి ఎస్‌కే గౌస్ బాషా దక్కించుకున్నాడు. వడ్లమూడి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ పోటీలకు ఆలిండియా రేడియో విశ్రాంత డైరెక్టర్ ముంజులూరి కృష్ణకుమారి, సాహితీ విమర్శకులు బాలాంత్రపు ప్రసూన న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.



విజేతలతో నిర్వాహకులు, న్యాయనిర్ణేతలు

నేడు వీఎంసీలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పటమట(విజయవాడతూర్పు): ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించేందుకు విజయవాడ నగరపాలకసంస్థ ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో కార్యక్రమం జరుగుతుందన్నారు. నగర వాసులకు వీఎంసీ కల్పిస్తున్న మౌలిక వసతుల్లో సమస్యలను అధికారులకు నేరుగా ఫిర్యాదు చేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అధికారులు ఫిర్యాదులను స్వీకరిస్తారని తెలిపారు. కార్యక్రమాన్ని నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాంకేతికతతో అద్భుత విజయాలు సాధించవచ్చు

భవానీపురం(విజయవాడపశ్చిమ): సాంకేతికతతో అద్భుత విజయాలు సాధించవచ్చని, ఆ దిశగా విద్యార్థులు కృషి చేయాలని తెనాలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి అకా పవన్‌కుమార్ పేర్కొన్నారు. జాతీయ పతాకం రూపశిల్పి పింగళి వెంకయ్య మనుమడు, దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ హైస్కూల్(డీఎస్‌ఎంసీ) పూర్వ విద్యార్థి మునిపల్లి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన మిత్రుడు న్యాయమూర్తి పవన్‌కుమార్ ఆదివారం డీఎస్‌ఎంసీ స్కూల్‌ను సందర్శించారు. స్నేహం గురించి విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం పవన్‌కుమార్ మాట్లాడుతూ ఈ పాఠశాలలో మిత్రుడు మునిపల్లి వెంకటేశ్వరరావుతో కలిసి చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. తాను పూర్తిగా తెలుగు మాధ్యమంలోనే చదువుకుని ఈ స్థాయికి వచ్చానని తెలిపారు. విద్యార్థులందరూ ఉన్నత పాఠశాల స్థాయిలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాతంగి కోటయ్య మాట్లాడుతూ.. మన పాఠశాలలో చదువుకుని ఈ రోజు న్యాయమూర్తిగా తిరిగి స్కూల్‌కు రావడం, అప్పటి మిత్రులను గుర్తు చేసుకోవడం ఆయన ఔన్నత్యానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కార్పొరేట్ విద్యా సంస్థల శిక్షకులు చిలుకూరి విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు కె.శివపార్వతి, ఎం.శారద, కె.నాగరాజు, వి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో జడ్జి పవన్‌కుమార్

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

50 ఏళ్ల తరువాత కలుసుకున్న హిందూ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): 'ఏరా... అప్పుడే ముసలోడివి అయిపోయావు.' అని ఒక పూర్వ విద్యార్థి అంటే 'నువ్వు కాలేదేమిట్రా..?' అంటూ మరో మిత్రుడు సమాధానం. వారంతా పదవీ విరమణ చేసిన అధికారులు, వ్యాపారాలు వారసులకు అప్పగించి విశ్రాంతి తీసుకుంటున్న కొంతమంది వృద్ధులు, ఇప్పటికీ వ్యాపారాల్లో బిజీగా ఉంటున్న మరికొంతమంది వారంతా కలుసుకొని సందడి చేశారు. వారందరూ 1974–1975లో విజయవాడ కొత్తపేటలోని హిందూ హైస్కూల్‌లో పదో తరగతి పూర్తి చేసుకొని బయటకు వచ్చిన పూర్వ విద్యార్థులు. 50 సంవత్సరాల క్రితం పాఠశాల నుంచి బయటకు వచ్చిన ఆ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నగరానికి సమీపంలోని ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించారు. పూర్వ విద్యార్థులందరూ కలుసుకొని సందడి చేశారు. నాటి గురువులను ఆహ్వానించి సత్కరించారు. విద్యార్థులు ఏమి చేస్తున్నారు, ఎక్కడ ఉన్నారనే అంశాలను తెలుసుకొని సంతోషాన్ని పంచుకున్నారు. అలాగే రానున్న కాలంలో మరిన్ని పర్యాయాలు కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. అంతేకాకుండా ముందుముందు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని నిర్ణయించారు.



1974 -75 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ఎంతో మంది అధికారులను అందించింది..



కొత్తపేట హిందూహైస్కూల్‌లో చదువుకున్న అప్పటి తరం మొత్తం మంచి స్థానాల్లో స్థిరపడ్డారు. అత్యధిక శాతం వివిధ హోదాల్లో అధికారులుగా పని చేసి పదవీ విరమణ చేసిన వారు చాలా మంది ఉన్నారు. వారందరినీ కలుసుకుంటే చాలా ఆనందంగా ఉంది. అందరూ ఉద్యోగాలు చేసి పదవీ విరమణ సైతం చేసేశారు. వారందరం కలుసుకోవటం చాలా సంతోషాన్ని కలిగించింది.

– సంపర రాంబాబు, మాజీ కార్పొరేటర్

చాలా నేర్చుకున్నాం..



నాడు హిందూ హైస్కూల్‌లో చదువుకున్న మేం చాలా నేర్చుకున్నాం. అప్పటి గురువులు బోధించిన విద్యాబుద్ధుల కారణంగానే మా జీవితాల్లోనూ చక్కగా రాణించాం. మా పిల్లలను ప్రయోజకులను చేశాం. ఇదంతా అప్పుడు గురువులు బోధించిన విద్యాబుద్ధులే మమ్మల్ని ఇంతటి వారిని చేశాయి. 50 సంవత్సరాల తరువాత అందరం కలుసుకోవడం ఆనందంగా ఉంది.

– గోకవరపు మురళీకృష్ణ, వ్యాపారవేత్త

ఆనందంగా ఉంది..



50 సంవత్సరాల తరువాత పూర్వ విద్యార్థులందరం కలుసుకోవటం ఆనందంగా ఉంది. ఇంత మంది పెద్ద పెద్ద హోదాల్లో పని చేశారని తెలిసి చాలా సంతోషంగా ఉంది. హిందూ హైస్కూల్ అప్పట్లో పెద్ద విద్యాసంస్థ. వందళ్లకు పైగా చరిత్ర ఉంది. అటువంటి గొప్ప విద్యాసంస్థలో మేం చదువుకోవటం చాలా గర్వకారణం. ఉద్యోగాల్లోనే కాదు వ్యాపార రంగంలోనూ బాగా ఉన్నారు.

– ఆవాల మారుతి, మాజీ కార్పొరేటర్

అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన బ్రెయిలీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయీ బ్రెయిలీ అని న్యూ లైఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫర్ ద బ్లైండ్ అధ్యక్షుడు జి.సీతారామస్వామి అన్నారు. ఆదివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో న్యూ లైఫ్ వెల్ఫేర్ ఫర్ ది బ్లైండ్ ఆధ్వర్యంలో బ్రెయిలీ 216వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రెయిలీ లిపి ద్వారా అంధుల జీవితాల్లో వెలుగులు నింపితే.. రాజ్యాంగం ప్రత్యేక హక్కులు కల్పించిందన్నారు. ప్రస్తుతం దివ్యాంగులు అనుభవిస్తున్న సౌకర్యాలు, హక్కులు అన్నీ పోరాటాల ద్వారానే సాధ్యమైందన్నారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ అమలు చేయడం జరుగుతోందన్నారు. న్యాయవాది రవీంద్రబాబు చట్టాలను వివరించారు. కార్యక్రమంలో ఒ. రమేష్, ఉపాధ్యక్షుడు, వి.కృష్ణమూర్తి, జనరల్ సెక్రెటరీ కె.సి.హెచ్ రెడ్డి, జి.జ్యోతి, కోశాధికారి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



• కళాకారులు సాంస్కృతిక వారధులు

విజయవాడ కల్చరల్: కళాకారులు సాంస్కృతిక వారధులని స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ బీ ఆశయ్య అన్నారు. రాగ లహరి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఆశీష్ స్టూడియోలో సినీ సంగీత విభావరి, సాంస్కృతిక సంస్థల నిర్వాహకులకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆశయ్య మాట్లాడుతూ దేశ సంస్కృతిని కాపాడేది సాంస్కృతిక ప్రదర్శనలేనన్నారు.